క్లుప్తంగా

ప్రమోషన్‌పై వెళ్తున్న వీఆర్వోకు సన్మానం



బూజునూరు వీఆర్వోను సన్మానిస్తున్న సర్పంచ్, సచివాలయ సిబ్బంది

గడివేముల: మండల పరిధిలోని బూజునూరు వీఆర్వోగా పనిచేస్తున్న ఇందిరమ్మ పదోన్నతిపై నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్తున్న సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. శుక్రవారం స్థానిక సచివాలయంలో సన్మాన కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ యేలంపల్లె రాములమ్మ మాట్లాడుతూ.. వీఆర్వోగా రైతులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది షబానా, బాషా, శివమ్మ, లీలావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరుని సేవలో కాటసాని



స్వామివారి తీర్థప్రసాదం స్వీకరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: యాగంటి ఉమామహేశ్వరస్వామిని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకం, అర్చన, విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకుడు మహేశ్వరశర్మ, ఈఓ చంద్రుడు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.

యువకుడి అదృశ్యం కేసు నమోదు



హరి కుమార్ (ఫైల్)

ఓర్వకల్లు: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన రసిక ఆంజనేయులు కుమారుడు రసిక హరికుమార్ అలియాస్ సాయి(23) రెండు నెలల క్రితం ఆస్తి కోసం కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. అప్పటి నుంచి మనస్తాపంతో ఉన్నాడు. ఈ నెల 15వ తేదీ ఆంజనేయులు కుటుంబ సభ్యులతో పనికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా హరికుమార్ లేదు. ఇంటికి తాళం వేసి, ఫోన్‌స్విచ్ ఆఫ్ చేసుకోవడంతో అతని స్నేహితులు, బంధువులను విచారించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపారు. యువకుని ఆచూకీ తెలిసినవారు 9121101067, 9121101065 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కోడుమూరు రూరల్: కోడుమూరుకు శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో నారాయణ మాట్లాడారు. సమీపంలోనే గాజులదిన్నె ప్రాజెక్టు ఉన్నప్పటికీ పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించకుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఇకనైనా తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం నాయకులు రాజు, వీరన్న, మనోహర్, జీపీ వీరన్న, లక్ష్మన్న, మద్దిలేటి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ శాఖలో చేపట్టనున్న అభివృద్ధి, మరమ్మతుల పనుల కారణంగా పాత పట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యు త్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఈఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని జొహరాపురం, చిత్తారిగేరి, జమ్మిచెట్టు ఏరియాలలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌పై మేధావుల సమావేశం

కర్నూలు కల్చరల్: కేంద్ర బడ్జెట్ 2025–26పై శనివారం ఉదయం 10 గంటలకు మౌర్య ఇన్ పరిణయ ఫంక్షన్ హాల్‌లో మేధావుల సమావేశం నిర్వహించనున్నట్లు కార్యక్రమ కన్వీనర్, విశ్వభారతి మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వెంకటరమణ తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.రామకృష్ణ అధ్యక్షతన జరిగే సమావేశంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ సి.శ్రీనివాసరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి ప్రధాన వక్తగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు.

ఆధ్యాత్మిక నిలయం.. బుగ్గ రామేశ్వర ఆలయం

- ఈ నెల 25 నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు
- 28న రథోత్సవం
- ఏర్పాట్లలో నిమగ్నమైన ఆలయ అధికారులు



కాల్వబుగ్గ ఆలయం



పుష్కరిణిలో నీటిని శుభ్రం చేస్తున్న ఆలయ సిబ్బంది

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ గ్రామంలో వెలసిన బుగ్గరామేశ్వర ఆలయం.. ఆధ్యాత్మిక నిలయంగా విరాజిల్లుతోంది. గర్భగుడి ఎదురుగా వెలసిన జంట నందులు ఆలయ చరిత్రకు సాక్షాలుగా దర్శనమిస్తున్నాయి. ఏటా మాఘమాసంలో వచ్చే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వారం పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు ఆలయ పుణ్యక్షేత్రం ముస్తాబవుతోంది. పచ్చని తోటలు, ఎత్తైన కొండల మధ్య ప్రాచీన కట్టడాలతో ఆలయ పరిసరాలు భక్తులకు ఆహ్లాదాన్ని పంచుచూ భక్తిభావాన్ని నింపుతోంది.

బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కాల్వబుగ్గలో ఈ నెల 25వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా 25వ తేదీ స్వాముల వారు కాల్వ గ్రామం నుంచి వర ప్రయాణం చేస్తారని ఆలయ ఈఓ బీటీ మద్దిలేటి తెలిపారు.

26న అంకురార్పణ

ఆలయంలో ఈ 26వ తేదీ ధ్వజారోహణంతో మహాశివరాత్రి వేడుకలకు అంకురార్పణ చేస్తారు. ఉదయం భ్రమరాంబదేవి, బుగ్గరామేశ్వర స్వామి వారికి పంచామృతాభిషకం, రాత్రి యమాభిషకంతో జాగారణ నిర్వహిస్తారు. 27వ తేదీ తెల్లవారుజామున స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. అదే రోజు ఉదయం సింహ వాహన సేవ, సాయంత్రం నందివాహన సేవలు జరగనున్నాయి. అనంతరం మంగళవాయిద్యాల మధ్య స్వామివారి ప్రభోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 28వ తేదీ సాయంత్రం ఆదిదంపతుల రథోత్సవం కనుల పండువగా జరుపుకుంటారు. మార్చి 1వ తేదీ వసంతోత్సవం, పారువేట నిర్వహిస్తారు. 2వ తేదీ ఉత్సవమూర్తులు కాల్వ గ్రామానికి తిరుగు ప్రయామవుతారని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుడు కాటినేని నారాయణ వెల్లడించారు.

బుగ్గరామేశ్వరస్వామిగా నామకరణం

కృష్ణదేవరాయులు పరిపాలించిన విజయనగర సామ్రాజ్య కాలంలో ఈ ప్రాంతాన్ని ముద్దనూరు కాల్వ సీమగా పిలిచేవారట. క్షేత్రానికి ఉత్తర వాయువ్య దిశలోని నీటిబుగ్గ ద్వారా ప్రవహించే నీరు హుశేనాపురం, కాల్వ గ్రామాల భూములను సస్యశ్యామలం చేసేదని స్థానికుల అభిప్రాయం. ఆ నీటి బుగ్గ వల్ల ఈ ప్రాంతానికి కాల్వబుగ్గ అని, ఇక్కడి మూలస్వామికి బుగ్గరామేశ్వరస్వామిగా నామకరణం చేసినట్లు చరిత్ర.

ఆలయ ప్రస్థానం

కర్నూలు నుంచి 30 కి.మీ దూరంలో ఈ ఆలయం ఉంది. నంద్యాలకు వెళ్లే మార్గంలో జాతీయ రహదారి పక్కనే ఉంటుంది. కాల్వబుగ్గ పరిసర ప్రాంతంలో పూర్వం మహా తపస్సంపన్నుడైన జమదగ్ని మహారాజు, శిరోమణి రేణుకాదేవి పుణ్యదంపతుల సప్తమ కుమారుడు పరుశురాముడు తన తండ్రిని సంహరించిన క్షత్రియ రాజులను దేశ నలుమూలల శోధించి నిర్మూలనం గావించారు. ఈ క్రమంలో తన దోషనివృత్తి భాగంగా కాల్వబుగ్గను సందర్శించారు. ఆ సమయంలో పరశురాముడు స్వహస్తాలతో శివలింగాన్ని ప్రతిష్ఠించి, స్వామివారికి ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర కారులు చెబుతున్నారు.

ఆలయ విశిష్టత

ఆలయ గర్భగుడి ఎదురుగా జంట నందులు, క్షేత్ర సమీపంలోని కొండలో బసవన్నపాదాలు, దూరుడు గుండు, తూర్పుదిశలో చిన్న బుగ్గ ప్రాంతం క్షేత్ర విశేషములుగా భక్తులు భావిస్తారు.

భక్తులకువసతులు

బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులు, సందర్శకుల సౌకర్యార్థం ఆలయ అధికారులు వసతులను ఏర్పాటు చేసేందుకు నిమగ్నమయ్యారు. ఇందులో ప్రధానంగా స్థానిక పుష్కరిణీలను శుభ్రం చేసి, విద్యుత్ మోటర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. స్త్రీ పురుషులకు ప్రత్యేక స్నానపు ఘాట్లు ఏర్పాటు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్, వ్యాపార దుకాణాల కోసం వేర్వేరుగా స్థలాలను కేటాయించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చే సందర్శకుల వాహనాల రాకపోకలకు ఇబ్బంధులు తలెత్తకుండా జాతీయ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేస్తారు. భక్తులకు క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయనున్నారు. మహిళా భక్తుల సౌలభ్యం కోసం సాధారణ మరుగుదొడ్లతో పాటు, మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే ఉచిత వైద్యం శిబిరం ఏర్పాటు చేస్తున్నారు.

వినోద కాలక్షేపాలు

భక్తుల కాలక్షేపానికి పలు రకాల వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 26వ తేదీ శివరాత్రి పండుగ రోజున ఉదయం షేక్ ఉసేన్ చెక్కభజన బృందం వారిచే కందికాయపల్లె చంటి సారథ్యంలో చెక్కభజన, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. అదే రోజు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి. రాత్రి సంగీత విభావరి ఉంటుంది. 27వ తేదీ రాత్రి భజన పోటీలు, 28వ తేదీ రాత్రి పంచమాంకములు అనే నాటక ప్రదర్శన నిర్వహిస్తారు. మూడురోజుల పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్ల పరిశీలన



బ్రహ్మోత్సవాల కరపత్రాలను పరిశీలిస్తున్న డీసీ గురుప్రసాద్

ఓర్వకల్లు: కాల్వబుగ్గ దేవస్థానాన్ని శుక్రవారం దేవదాయశాఖ ఉప కమిషనర్ గురుప్రసాద్ సందర్శించారు. ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. శివరాత్రి జాగారణ సందర్భంగా నిర్వహించే ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల గురించి ఆలయ ఈఓ మద్దిలేటిని అడిగి తెలుసుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో అందుకు సరిపడే వసతులను సమకూర్చాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ తదితర సమస్యలు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యుడు కాటినేని నారాయణ, అర్చకులు కల్లె లక్ష్మినారాయణశర్మ, ఆలయ సిబ్బంది ఉన్నారు.

సబ్సిడీ లోన్లకు ఇంటర్వ్యూలు



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న బ్యాంకు సిబ్బంది

గడివేముల: వివిధ కార్పొరేషన్లకు సంబంధించి సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఆయా బ్యాంకు మేనేజర్ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్తా తెలిపారు. మండలానికి 63 యూనిట్లకు గాను 580 అప్లికేషన్స్ వచ్చాయన్నారు. త్వరలోనే అర్హుల జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు.

24న ఇంటర్వ్యూలు

కల్లూరు: బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 24వ తేదీ స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్ పత్రాలు, కుల, ఆదాయ, రేషన్ కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పాత్రలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

25న 'కార్పొరేషన్' రుణాలకు ఇంటర్వ్యూలు

ఓర్వకల్లు: బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఆయా బ్యాంకుల అధికారులతో కలిసి దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తులతో పాటు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, కులం, ఆదాయం, విద్యార్హత ధ్రువపత్రాలతో ఉదయం 10.30 గంటల్లోగా హాజరుకావాలని సూచించారు.

24న సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

కర్నూలు(రూరల్): బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 24న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు.

భక్తులకు మెరుగైన వైద్య సేవలందించాలి



భక్తులకు మందులను అందజేస్తున్న నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు

కోడుమూరు రూరల్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి కాలినడకన వెళుతున్న భక్తులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడలాఫీసర్ డా.రఘు వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం కోడుమూరులోని పత్రప్పజిన్నులో శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తులకు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని డా.రఘు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిబిరంలో పాదయాత్రీకులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీయడంతో పాటు, పాదయాత్రీకులకు మందులను అందజేసి తగు సూచనలిచ్చారు. డా.రఘు మాట్లాడుతూ శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తుల సౌకర్యార్థం జిల్లాలో రేమట, సి.బెళగల్, పోలకల్, గూడూరు, కోడుమూరు, పెంచికలపాడు, పెద్దపాడు, కల్లూరు, బళ్ళారి చౌరస్తా, గార్గేయపురం, గోకులపాడు వద్ద 24గంటల పాటు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే భక్తులు కూడా పాదయాత్ర సమయంలో శుభ్రమైన మంచి నీరు, ఆహారం తీసుకోవాలని, ఎండలో నడిచేటప్పుడు తలపై టోపీగాని, టవల్‌గాని వేసుకోవాలని డా.రఘు భక్తులను కోరారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బాల స్వస్త్యా కార్యక్రమ సమన్వయకర్త డా.శైలేష్, కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డా.మదన్ శేఖర్, అన్నదాన శిబిరం దాత ఎస్‌జీ.శంకర్‌బాబు, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలి

సి.బెళగల్: మండలంలో రీ సర్వే పనులను పకడ్బందీగా చేపట్టాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం రెవెన్యూ అధికారులకు సూచించారు. శుక్రవారం చింతమానుపల్లె గ్రామంలోని సర్వే నెంబర్ 178లో ఎనిమిదవ బ్లాక్‌లో రెండవ బృందం సభ్యులు చేపట్టిన సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సర్వే అధికారులతో మాట్లాడుతూ రైతుల సమక్షంలో కొలతలను తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే రిపోర్ట్ ను నమోదు చేయాలని సూచించారు. రీ సర్వే డిప్యూ టీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వో సాయిరమణ ఉన్నారు.

మెనూ పాటించకపోతే చర్యలు

సి.బెళగల్: మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పాటించకపోతే చర్యలు తప్పవని ఎంఈఓ ఆదామ్‌బాషా నిర్వాహకులను హెచ్చరించారు. శుక్రవారం ఆయన కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల గ్రామాల పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కె.సింగవరం యూపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి, నాణ్యత పాటించాని ఉపాధ్యాయులు, వంట నిర్వాహకులకు సూచించారు.

తాగునీటి పైపును ఎత్తుకెళ్లిన దుండగులు

సి.బెళగల్: మండల పరిధిలోని ఎర్రగుంట్ల కొట్టాల గ్రామానికి తాగునీరు సరఫరా చేసే పైపులైను పైపును దుండగులు ఎత్తుకెళ్లారు. బ్రాహ్మణదొడ్డి గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడి వద్ద బోరు ద్వారా ఎర్రగుంట్ల కొట్టాల గ్రామానికి పైపులైన్‌తో తాగునీరు సరఫరా అవుతోంది. కొంతమంది దుండగులు పైపులైన్ పైపును తొగించుకుని ఎత్తుకెళ్లడంతో గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోయింది. అధికారులు దుండగులను గుర్తించి చర్యలు తీసుకుని, నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంపద తయారీ కేంద్రాలను వృద్ధిలోకి తీసుకురావాలి



చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారీపై శిక్షణ ఇస్తున్న డీపీఓ భాస్కర్

కోడుమూరు రూరల్: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మార్చి 31లోగా వృద్ధిలోకి తీసుకురావాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా శుక్రవారం ఇంటింటి నుంచి చెత్త సేకరణ–చెత్త నుంచి సంపద తయారీపై జిల్లాలోని ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు డీపీఓ భాస్కర్ కోడుమూరులో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, ఇంటింటి నుంచి చెత్త సేకరణపై జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీపీఓ భాస్కర్ ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు కలిసికట్టుగా పనిచేసి జిల్లాలోని అన్ని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను వృద్ధిలోకి తీసుకురావాలన్నారు. ఇంటింటి నుంచి చెత్తను సేకరించి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్టును తయారు చేయాలన్నారు. డీపీఓ భాస్కర్ మాట్లాడుతూ మండలాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వృద్ధిలోకి తెచ్చి, చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారీ చేసి పంచాయతీలకు సంపదను సృష్టించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓలు వీరభద్రప్ప, లక్ష్మి, డీపీఆర్‌సీ డీసీ మంజులవాణి, ఎంపీడీఓ రాముడు, సర్పంచు భాగ్యరత్న, ఆయా మండలాల ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రాలు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెంచిన కూలీ రేట్ల జీఓను విడుదల చేయాలి



గోదాము ఇన్‌చార్జ్ ఆఫీసర్ నస్రీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న హమాలీ కార్మికులు

కోడుమూరు రూరల్: సివిల్ సప్లై హమాలీల పెంచిన కూలీ రేట్లను జీఓను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన కూలీ రేట్లను జీఓను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గూడూరులోని సివిల్ సప్లై గోదాము హమాలీ కార్మికులు ఎంఎల్‌సీ పాయింట్ దగ్గర సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 9నెలలు గడుస్తున్నా హమాలీ కూలీలకు సంబంధించి పెంచిన కూలీ రేట్ల జీఓను విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహారిస్తోందన్నారు. గోదాములో రేయింబవళ్లు పనిచేసే హమాలీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చాలిచాలని కూలీలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పెంచిన కూలీ రేట్ల జీఓను వెంటనే విడుల చేయడంతో పాటు, కార్మికులకు పెన్షన్, ప్రమాద బీమా, గూడూరు ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముకు వే బ్రిడ్జి వేయాలని, కాపౌండ్ వాల్ నిర్మించాలని, సమస్యలను పరిష్కరించకపోతే మార్చి7న విజయవాడలోని డీఎం కార్యాలయాన్ని కార్మికులతో కలిసి ముట్టడిస్తామని మోహన్ హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు ఎంఎల్ఎస్ పాయింట్ గోదాము ఇన్‌చార్జ్ ఆఫీసర్ నస్రీన్‌కు అందజేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ కార్మికులు మధు, రామాంజనేయులు, దానమన్న, రంగన్న, గోపి, మల్లికార్జున, కృప, గజ్జలన్న పాల్గొన్నారు.

మాతృభాష గొప్పతనాన్ని చాటిచెప్పండి



తెలుగు భాష విశిష్టత గురించి వివరిస్తున్న హెచ్‌ఎం రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

ఓర్వకల్లు: సమాజంలో ప్రతి ఒక్కరూ మాతృభాష గొప్పతనాన్ని చాటి చెప్పాలని హెచ్‌ఎం రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. మాతృభాష ఎవరికైనా అమ్మతో సమానమని, అమ్మను గౌరవించినట్లుగానే మనమందరం తెలుగు భాషను గౌరవించాలని సూచించారు. తెలుగు భాషలో మాట్లాడడం, తెలుగు రాయడం అలవరచుకోవాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ఏకపాత్రాభినయం, కవితలు, పొడుపు కథ లు, పద్యాలు చెప్పించడం, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఇందులో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు విద్యార్థులతో కలిసి చేసిన తెలుగు భాష తియ్యదనం, తెలుగు భాష గొప్పదనం అనే పాట అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యా యులు వరలక్ష్మి, నాగేంద్రమ్మ, శ్యామలమ్మ, చంద్రశేఖర్‌రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిరామ్‌లో మాతృభాష దినోత్సవం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడమెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఏటా ఫిబ్రవరి 21న మాతృభాష దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. మన దేశ సంస్కృతి సంప్రదాయాల గురించి తెలుసుకోవాలని సూచించారు. మాతృ భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. అదే సమయంలో మనుగడ కోసం ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదన్నారు. అనంతరం తెలుగు భాష గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలే బుద్ధి చెప్పాలి



అంబేద్కర్ నగర్ వాసులకు అవగాహన కల్పిస్తున్న నారాయణ

కర్నూలు(రూరల్): ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలే బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేవీ నారాయణ ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని అంబేడ్కర్ నగర్‌లో శుక్రవారం లెనిన్ రచించిన రెడ్‌బుక్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ కార్మికులకు రెడ్‌బుక్‌పై అవగాహణ కల్పించారు. కార్పొరేట్, ప్రైవేట్ సంస్థల కోసం పనిచేస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలను ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు రాఘవేంద్ర, సీనియర్ నాయకులు బీసన్న, నరసింహ, శంకర్, మస్తాన్ పాల్గొన్నారు.

నేడు నరసింహారెడ్డి వర్ధంతి

కర్నూలు కల్చరల్: స్వాతంత్ర్య సరయోదుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతిని ఏక్యాంప్‌లోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్‌లో శనివారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి అధ్యక్షుడు వి.విజయమోహన్ రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. అలాగే వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి సేవలో ఉప కమిషనర్

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దేవదాయశాఖ ఉప కమిషనర్ పి. గురు ప్రసాద్ శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారికి విశేష పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆయనకు శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఉద్యోగి సుబ్బారెడ్డి, అర్చకుడు కిట్టయ్య తదితరులు ఉన్నారు.

సాధికార సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 20 శాతం కుటుంబాలకు ఆర్థిక సాధికారత కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సాధికార(పీ–4) సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించేందుకు పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్నర్‌షిప్(పీ–4) సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు జరిగే ఈ సర్వేలో సచివాలయ సిబ్బందికి కేటాయించిన క్లస్టర్లలో సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. క్లస్టర్ పరిధిలోని కుటుంబం వద్దకు వెళ్లి వారి వ్యక్తిగత వివరాలతో పాటు, కనీస అవసరాలు, జీవన విధివిధానాల వంటి అంశాలపై సర్వే చేయాలని తెలిపారు. ఈ సర్వేలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించి గ్రామసభ ద్వారా ఆమోదించిన వారికి ప్రభుత్వం ఆర్థిక సాధికారతను కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పాణ్యం: మండల కేంద్రంలోని ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ సమీపంలో జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. రోడ్డు మరమ్మతుల కారణంగా వన్‌వే ద్వారా వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. ఈ క్రమంలో కర్నూలు వైపు వెళ్తున్న బస్సు డైవర్షన్ వద్ద నెమ్మదిగా వెళ్తుండగా వెనుక మూడు కార్లు ఉన్నాయి. ఈ క్రమంలో వేగంగా వచ్చిన మరో కారు మూడు కార్లను ఢీకొంది. ఈ ఘనటలో ఢీకొన్న కారులోని నంద్యాలకు చెందిన వైద్యుడు హరిబాబు స్వల్పంగా గాయపడ్డారు. ఒక కారు దెబ్బతింది.

రెగ్యులర్‌గా సమావేశాలు నిర్వహించాలి

సి.బెళగల్: పొదుపు సంఘాల సమావేశాలను నెలవారీగా గ్రామైక్య సంఘాల (జీఐఎస్) అధ్యక్షులు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఏపీఎం రామేశ్వర్ సూచించారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ఆయన మండల మహిళా సమాఖ్య (ఎంఎంఎస్) సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా జరిగే జీఐఎస్ సమావేశ తేదీలపై చర్చించారు. అనంతరం పొదుపు నిధులు వినియోగం, నగదు జమ, బ్యాంక్ రుణాలపై మాట్లాడారు. రుణాల రీషెడ్యూల్ అంశాలను జీఐఎస్ అధ్యక్షులు ఏపీఎం, సీసీలు తెలియజేశారు. కార్యక్రమంలో సీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.